క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.17, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 38, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 15, క్యారెట్ 38, దొండ 18, గుండుబీన్స్ 115, గింజ చిక్కుడు 60, గోకరకాయ 45, కీర 16, దోసకాయ 15, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 20, చామగడ్డ 35, మొరంగడ్డ 13, కందగడ్డ 55, సొరకాయ 7, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

మెట్లదారి నిర్మాణ పనుల ప్రారంభం



మెట్లదారి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: స్థానికుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపడుతున్నామని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. అడ్డగుట్ట డీ సెక్షన్‌లో ఆమె సోమవారం మెట్లదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసన్న మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని, ప్రాంతాల వారీగా సమస్యలను గుర్తించి డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సహకారంతో వాటిని పరిష్కరిస్తున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్ నేతలు లింగాని శ్రీను, జీహెచ్‌ఎంసీ డీఈ పద్మలత, ఏఈ వేణు, పార్టీ నేతలు మహ్మద్, వసంత, నర్సింగ్, గోపి, దేవయ్య, గౌస్, అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటి కేసు ఎందుకు నమోదు చేయలేదు?

సిటీ పోలీసులను ప్రశ్నించిన జాతీయ ఎస్సీ కమీషన్



జాతీయ ఎస్సీ కమీషన్ ముందు హాజరైన ఓయూ ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో గత సంవత్సరం డిసెంబర్ 30న లాలాపేట వినోభానగర్‌లో చోటు చేసుకున్న పాండు హత్య కేసులో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు ఎందుకు నమోదు చేయలేదని జాతీయ ఎస్సీ కమీషన్ సిటీ పోలీసులను ప్రశ్నించింది. హైదరాబాద్ నగర పర్యటనలో భాగంగా సోమవారం దిల్ ఖుష్ గెస్ట్ హౌజ్‌లో జాతీయ ఎస్సీ కమీషన్ వైస్ చైర్మెన్ డాక్టర్ అరుణ్ హెల్డర్ కమిషన్ ముందుకు వచ్చిన పలు ఎస్సీ ఎస్టీ కేసులను విచారణ చేశారు. ఇందులో భాగంగా దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన పాండు హత్య కేసును కమిషన్ దృష్టికి తీసుకెళ్లింది. ఓయూ పోలీసులు సరైన విచారణ చేయలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. కమిషన్ ముందు హాజరైన పోలీసు ఉన్నతాధికారులను, కేసు విచారణ అధికారి ఓయూ ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్‌ను ఉద్దేశించి పాండు హత్య ఘటనలో నిందితులు మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తి అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. వెంటనే నిందితునిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలనీ ఆదేశించారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించాలనీ దళిత అభివృద్ధి అధికారులకు సూచించారు.

క్రమ శిక్షణతో కూడిన విద్యతో ఉత్తమ ఫలితాలు



విద్యార్థులను సత్కరిస్తున్న డైరెక్టర్ వినోదా వెంకటస్వామి

లాలాపేట: క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించడం వల్లే ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఐఎస్‌ఓ విద్యా సంస్థల డైరెక్టర్ వినోదా వెంకటస్వామి అన్నారు. సోమవారం తార్నాకలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి సనా, అంజలి 95 శాతం, సెకండ్ ఇయర్‌లో షేక్ రియాజ్, తేజస్వీ, సైరాభాను తదితరులు 97 శాతం మార్కులు సాధించారు. ప్రతిభకనభరచిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, బహుమతులతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా...

- రూ. 12 కోట్లతో శ్రీవారి ఆలయ నిర్మాణం
- కాంచీపురం నుంచి 300 టన్నుల కృష్ణశిలలు దిగుమతి
- ఆధ్యాత్మిక కేంద్రంగా శ్రీనివాసనగర్



ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన బాలాలయం

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లోని శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం త్వరలోనే ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లనుంది. సుమారు రూ.12 కోట్లతో ఆధ్యాత్మిక భక్తిభావం ఉట్టిపడేలా సకల సదుపాయాలతో ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. తమిళనాడు కాంచీపురం నుంచి దిగుమతి చేసుకున్న సుమారు 300 టన్నుల కృష్ణశిలలతో ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. నిష్ణాతులైన శిల్పులు ఆధ్వర్యంలో రూపొందుతున్న ఆధ్యాత్మిక కేంద్రాన్ని భక్తులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఆలయ పునర్‌నిర్మాణ కమిటీతోపాటు దేవాదాయశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ఆలయ పునర్‌నిర్మాణానికి సంబంధించిన అన్నిరకాల అనుమతులను దేవాదాయశాఖ మంజూరు చేసింది. స్వామివారి గర్భాలయం, ముఖ మండపం నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. 2022 ఆగస్ట్ 4న పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకరభారతీ పునర్‌నిర్మాణ పనులను ప్రారంభించారు. మూలమూర్తుల శక్తిని ఆవాహన చేసుకుని రాగి కలషాల్లో నింపి, బాలాలయంలో ప్రతిష్ఠించి దీపధూప నైవేద్యాలతో కైంకర్యాలు, ఆర్జిత సేవలను నిర్వహిస్తున్నారు.

ఘనమైన ఆలయ చరిత్ర..

స్వామివారి ఆలయాన్ని నిర్మించేందుకు పద్మారావునగర్ వాకర్‌టౌన్‌కు చెందిన ఎన్నెల బలరాం వేయి గజాల స్థలాన్ని విరాళంగా అందించారు. స్థానికులు కమిటీగా ఏర్పడి నిధులు సమకూర్చి 1968 మే 6న ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో అదే ఏడాది సెప్టెంబర్ 6న కంచికామకోటి శంకరాచార్యులు చంద్రశేఖరేంద్ర సరస్వతి నేతృత్వంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఆలయ ప్రాంగణంలో ధ్యానమందిరం, రాజగోపురం, యాగశాల, కల్యాణ మండపాలను నిర్మించి భక్తులకు అందుబాటులోకి తెచ్చారు.

ఎనిమిది ఆలయాల సమాహారం..

- శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం వివిధ దేవుళ్లకు చెందిన ఎనిమిది ఆలయాల సమాహారంగా తీర్చిదిద్దనున్నారు.
- ప్రధానమైన ప్రసన్న వెంకన్నస్వామి, పద్మావతి, గోదాదేవి, సుదర్శన నారసింహస్వామి, ఆంజనేయస్వామి, నవగ్రహాలు, సర్పదోషనివారణీతోపాటు నూతనంగా కుబేర జ్ఞాన దక్షిణామూర్తి, సీతారామచంద్ర స్వామి ఆలయాలను నిర్మిస్తున్నారు.
- దర్శనం చేసుకునే సమయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయశాఖ స్తపతి వలినాయగమ్ ఆధ్వర్యంలో ఆయా ఆలయాలను క్రమపద్ధతిలో శాస్త్రప్రకారం నిర్మిస్తున్నారు.
- బాలాలయంలో భక్తులు తమ మొక్కులు తీర్చుకోవచ్చని ఆలయ ఈఓ రాజేష్‌కుమార్ తెలిపారు.

12 మందితో పునర్నిర్మాణ కమిటీ..

ఆలయ పునర్‌నిర్మాణ కమిటీని 12 మంది భక్తులు, ఆధ్యాత్మికవేత్తలతో దేవదాయశాఖ ఏర్పాటు చేసింది. ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) రాజేష్‌కుమార్, ఆలయ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్‌చైర్మన్ వేణుగోపాలరావు, కేకే లక్ష్మీనారాయణ, పీఏఆర్‌ఎస్ సుబ్రహ్మణ్యం, బాలభాస్కర్, కేజీ నారాయణన్, శివశంకరన్, సుజయ్‌ప్రకాశ్, గాయత్రి, ఉమేష్‌లతోపాటు దేవదాయశాఖ స్తపతి వలినాయగమ్‌తో కమిటీ ఏర్పాటు చేసింది. కమిటీ సభ్యులే ఆలయ నిర్మాణానికి మేజర్ దాతలు కావడం విశేషం.

ఆధ్యాత్మిక భక్తిభావం పెంపొందించేందుకే..

ఆధ్యాత్మిక భక్తిభావాన్ని పెంపొందించేందుకే ఆలయ పునర్‌నిర్మాణ కార్యక్రమం చేపట్టాం. ఆగమశాస్త్ర ప్రకారం ఆలయంలో సకల సౌకర్యాలు కల్పించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తాం. సుమారు ఏడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఆలయ పైకప్పు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. జీర్ణోద్ధారణ ఆలయంగా భావించి పునర్‌నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన దేవదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కమిషనర్ అనీల్, రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణరావు, ఇతర ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు.

–బసవరాజు శ్రీనివాస్, కమిటీ చైర్మన్

దాతలు సహాయ సహకారాలు అందించాలి..

ఆలయ పునర్‌నిర్మాణంలో భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు, ప్రజలంతా భాగస్వాములై తమవంతు సహాయ సహకారాలు అందించాలి. ఆలయ ప్రాంగణంలోని కార్యాలయంలో విరాళాలు అందించి తగిన రసీదు పొందాలి. ఆలయ పునర్‌నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది జూన్ లోగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం.

–వేణుగోపాలరావు, కమిటీ వైస్‌చైర్మన్

ఓయూలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ఓయూలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో సంస్కృతం యూనివర్సిటీ ఏర్పాటు ప్రకటనపై ఓయూ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సంస్కృతం విభాగం విద్యార్థులు ఆర్ట్స్ కాలేజీ ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. మహాకవి మల్లినాథ సూరి పేరున సంస్కృత యూనివర్సిటీ ఏర్పాటు ప్రకటన పట్ల బేగంపేట మహిళ కళాశాల అధ్యాపకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ జంగం అవినాష్ ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఓయూ సంస్కృత విభాగం విద్యార్థులు కట్ట శేఖర్, నటరాజ్, మహేష్, సుబ్బారాయుడు, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

అంసా అధ్యక్షులుగా నామ సైదులు



నామ సైదులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) అధ్యక్షులుగా నామ సైదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఓయూలో జరిగిన అంసా రాష్ట్ర స్థాయి సమావేశంలో ఓయూ లా విద్యార్థి నామ సైదులును ఎంపిక చేసినట్లు అంసా రాష్ట్ర అధ్యక్షులు అంగిరి ప్రదీప్, ప్రధాన కార్యదర్శి మంచాల లింగస్వామి తెలిపారు.

అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు స్పెషల్ డ్రైవ్



మాట్లాడుతున్న ఈఆర్వో, డీసీ దశరథ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం ఈఆర్వో, డీసీ దశరథ్ నేతృత్వంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ దశరథ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వేరే పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓటర్లు వారి ఇంటి దగ్గరలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటును పొందే విధంగా ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. దీనికి సంబంధించి ఇప్పటికే తమ సిబ్బంది కసరత్తు పూర్తి చేశారని తెలిపారు. అదే విధంగా నియోజకవర్గంలో ఇప్పటివరకు పోలింగ్ కేంద్రాలు లేని ప్రభుత్వ భవనాలను కూడా గుర్తిస్తున్నామన్నారు. వాటిలో నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఒకే చోట ఎక్కువ పోలింగ్ కేంద్రాలున్న భవనాలలోని ఓటర్లను నూతనంగా ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలకు మారుస్తున్నామన్నారు. అంతే కాకుండా ఒకే ఇంట్లో ఆరుగురు కంటే ఎక్కువ ఉన్న ఓటర్లను గుర్తించేందుకు కూడా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు వివరించారు. ఈ సమావేశంలో సెక్షన్ ఇంచార్జ్ భుజేందర్ బాబు, జయకృష్ణ, వివిధ పార్టీల నేతలు ప్రకాష్, ప్రవీణ్, నర్సింగ్ రావు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు గుర్తింపు..

సనత్‌నగర్: నేషనల్ రూరల్ ఇనిస్టిట్యూషన్స్ సస్టెయినబులిటీ గ్రేడింగ్ (ఎన్‌ఆర్‌ఐఎస్‌జీ)లో బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఏ ప్లస్ గుర్తింపును పొందింది. స్వచ్ఛ భారత్ నిర్వహణ, పచ్చదనం పెంపొందింపజేయడం, ప్రకృతి జలాల పరిరక్షణ, వర్షపు నీటిని ఒడిసిపట్టుకోవడం, సోలార్ విద్యుత్ ఉత్పత్తి వినియోగం, వేస్ట్ మేనేజ్‌మెంట్ అంశాల్లో అక్రిడిటేషన్ పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఈ గుర్తింపు సాధించడంలో విశేషంగా కృషి చేసిన ఆయా డిపార్ట్‌మెంట్ల అధిపతులను, ప్రొఫెసర్లను, సిబ్బందిని ప్రిన్సిపాల్ అభినందించారు.

గృహిణి అదృశ్యం



ఖాజాభాను

చిలకలగూడ : గృహిణి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వారాసిగూడకు చెందిన ఖాజాభాను (30)కు పదిహేనేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన మహ్మద్‌యూసఫ్‌తో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు. ఈనెల 14వ తేది ఉదయం బయటకు వెళ్లిన ఖాజభాను తిరిగి ఇంటికి చేరలేదు. సన్నిహితులు, బంధుమిత్రులను వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో తల్లి సైదాభాను సోమవారం పోలీసులను ఆశ్రయించింది. భర్త వేధింపులు భరించలేక గతంలోను ఖాజభాను ఇల్లు విడిచివెళ్లి కొన్ని రోజుల తర్వాత తిరిగి వచ్చిందని తన ఫిర్యాదులో పేర్కొంది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జైప్రకాష్

రసూల్‌పురా: కంటి వెలుగు వైద్య కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు వి. జైప్రకాష్ అన్నారు. సోమవారం కంటోన్మెంట్ బోర్డు ఎనిమిదవ వార్డు బొల్లారం చింతల్‌బజార్‌లో రెండవ విడత కంటి వెలుగు కేంద్రాన్ని జైప్రకాష్ ప్రారంభించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శమని ప్రతీ ఒక్కరూ కంటివైద్య శిబిరానికి వచ్చి నేత్ర పరీక్షలు నిర్వహించుకోవాలని కంటి అద్దాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరక్టర్ జవహార్, బాల్‌రాజు, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాల వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన

సనత్‌నగర్: సనత్‌నగర్‌లోని ఓ కార్పొరేట్ కళాశాలలో వేసవిలో కూడా తరగతులు నిర్వహించడంపై విద్యార్థి సంఘాలు సోమవారం ఆందోళనకు దిగాయి. తరగతులు బంద్ చేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి కాలంలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు తరగతులు నిర్వహించవద్దన్నారు. ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు దాడులు చేస్తే అధికారులకు లక్షల రూపాయలు లంచాలు ఇచ్చి తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులు మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. వెంటనే ఇంటర్మీడియెట్ తరగతులను ఆపివేయాలన్నారు.



సనత్‌నగర్‌లో కార్పొరేట్ కళాశాల ముందు ధర్నాకు దిగిన విద్యార్థి సంఘాల ప్రతినిధులు

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్, రోడ్డు ఆక్రమణలతో తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అడ్డగుట్ట: ఫుట్‌పాత్, రోడ్ల ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని మారేడుపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ యాదేందర్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం అడ్డగుట్ట చంద్రయ్య హోటల్ నుంచి తుకారాం గేట్ సుభాష్ బొమ్మ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ యాదేందర్ మాట్లాడుతూ రోడ్డు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణల కారణంగా పాదచారులకు, వాహనాల రాకపోకలు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. పాదచారులు నడిచేందుకు తగినంత మార్గం కూడా లేకపోవడంతో రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి ఎదురవుతోందని, తద్వారా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. అందువల్ల స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు, పాదచారులకు ఇబ్బందులు కలిగించే విధంగా ఫుట్‌పాత్, రోడ్ల ఆక్రమణలకు పాల్పడిన పలువురు దుకాణదారులకు చలాన్లు విధించారు.

ప్రజా సమస్యలపై వెంటనే స్పందించండి



బాపూబాగ్‌కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్

రాంగోపాల్‌పేట్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో వెంటనే స్పందించాలని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ అన్నారు. సోమవారం బాపూబాగ్‌కాలనీ, కృష్ణానగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో జలమండలి డీజీఎం శశాంక్, మేనేజర్ వెంకట్, జీహెచ్‌ఎంసీ డీఈ సంతోష్, ఏఈ నవీన్, హార్టికల్చర్ అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో మురుగు నీటి సమస్యను, కలుషిత జలాల సమస్యను స్థానిక ప్రజలు ఆమె దృష్టికి తీసుకుని వచ్చారు. అలాగే చెట్ల కొమ్మలు అడ్డుగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని అవసరమైతే కొత్త పైప్‌లైన్ నిర్మాణాలు చేపట్టి శాశ్వతంగా మురుగు నీటి సమస్యకు పరిష్కారం చూపించాలని చెప్పారు. మురుగు నీరు పొంగి పొర్లడంతోనే చాలా చోట్ల కలుషిత జలాల సమస్యలు వస్తున్నాయని కాబట్టి మురుగు నీటి సమస్యను పరిష్కరిస్తే కలుషిత జలాల సమస్య కూడా ఉత్పన్నం కాదని చెప్పారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి కూడా లేకుండా చూడాలని ఆమె సూచించారు. బీజేపీ నాయకులు చీర శ్రీకాంత్, ఆషా, నిర్మల, సాయి, మనోజ్, రవి, నరేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మన దేశానికి గాంధీలు కావాలి..గాడ్సేలు కాదు



ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

రసూల్‌పురా: మన దేశానికి గాంధీలు కావాలని గాడ్సేలు కాదని బీఆర్‌ఎస్ మల్కాజ్ గిరి పార్లమెంట్, కంటోన్మెంట్ నియోజకవర్గం ఇంచార్జీ మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం తిరుమలగిరి జయలక్ష్మి గార్డెన్‌లో బోర్డు మాజీ సభ్యులు పి. భాగ్యశ్రీ శ్యామ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్ర మంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు క్రిషాంక్, ఎర్రోళ్ళ శ్రీను, గజ్జెల నాగేష్‌లతో కలిసి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్న కేంద్ర ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలు పెంచుతూ ప్రజలపై భారం మోపుతోందని విమర్శించారు.

దంపింగ్‌యార్డుగా మార్చింది బీజేపీ నేతలే..

రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మన్నే క్రిషాంక్ మాట్లాడుతూ తిరుమలగిరి గాంధీ కమ్యూనిటీహాల్‌ను కూల్చివేసి దంపింగ్‌యార్డుగా మార్చింది బీజేపీయే నని అన్నారు. వచ్చే ఎన్నికల అనంతరం గాంధీ కమ్యూనిటిహాల్ స్వాధీనం చేసుకుని ప్రజ లకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మరచిపోయిన బ్యాగు అందజేత



బ్యాగును వారి కుటుంబసభ్యుడికి అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

సికింద్రాబాద్: రైల్వే స్టేషన్‌లో మరచిపోయిన బ్యాగును యజమాని కుటుంబసభ్యులకు రైల్వే పోలీసులు అప్పగించిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. బేగంపేట్‌కు చెందిన పర్వేజ్ అన్వర్(76) ఢిల్లీ వెళ్లేందుకు సోమవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి ఉదయం 6 గంటలకు తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలెక్కాడు. ఈ క్రమంలో తన బ్యాగును స్టేషన్లోనే మరిచిపోయాడు. బ్యాగు కనిపించడంలేదని ఆలస్యంగా గుర్తించిన పర్వేజ్ వెంటనే తన కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. కాగా, అప్పటికే రోజువారి తనిఖీల్లో భాగంగా జీఆర్పీ, రైల్వే పోలీసులు ప్లాట్‌ఫాం నెం. 1లో ఒక బ్యాగును గమనించారు. అనంతరం, దాన్ని ఓపెన్ చేసి చూడగా అందులో రూ. 1లక్ష 5 వేల రూపాయలు, బట్టలు కనిపించాయి. అందులో దొరికిన ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ ఆధారంగా బ్యాగు యజమానికి ఫోన్ చేసి సమాచారమిచ్చారు. అనంతరం, అన్వర్ కుటుంబసభ్యుడైన జావీద్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి బ్యాగును తీసుకొని వెళ్లాడు. బ్యాగును అప్పగించిన వారిలో ఆర్‌హెచ్‌సీలు కే. నాగేశ్వర్‌రావు, కే. శంకర్, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ నరేందర్ బాబులు ఉన్నారు.

వైద్యం అందించడంలో సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తోంది



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తుందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సీతాఫల్‌మండి డివిజన్‌కు చెందిన వినోద్ కుమార్, తార్నాకకు చెందిన సౌమ్యతో పాటు అడ్డగుట్టకు చెందిన సాయికుమార్‌లు గత కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధ పడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సాయికుమార్‌కు రూ. 2.50 లక్షలు, సౌమ్యకు రూ. 2 లక్షలు, వినోద్ కుమార్‌కు రూ. 2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. ఈ సందర్భంగా సోమవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులకు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సీఎంఆర్‌ఎఫ్‌కు సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జహంగీర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక సుందరీకరణకు ప్రతిపాదనలు

చిలకలగూడ : సీతాఫల్‌మండి హిందూ శ్మశానవాటిక సుందరీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు స్థానిక కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఈఈ ఆశాలత, ఏఈ కౌషిక్‌లతో కలిసి సోమవారం శ్మశానవాటికను సందర్శించి పలు అంశాలపై చర్చించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం వైకుంఠధామాల సుందరీకరణ, వసతులు, సౌకర్యాలపై దృష్టి సారించినట్లు తెలిపారు.

పూడికతీత పనుల పరిశీలన

డివిజన్ పరిధిలోని స్పైడేమార్కెట్, శ్రీనివాసనగర్, షాబాద్‌గూడ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ సామల హేమ జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సోమవారం పర్యటించి నాలా పూడికతీత పనులను పరిశీలించారు.

